కొరవడిన వసతులు

పెచ్చులూడి కింద పడుతున్న గదుల పైకప్పు.. అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు.. రాత్రిళ్లు రక్షణ లేని వైనం.. వసతులు లేక, పట్టించుకునే నాథుడు లేక వసతి గృహాల్లో ఉన్న పేద పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాది మంచి ప్రభుత్వమని చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

- హాస్టళ్లలో అస్తవ్యస్తంగా మరుగుదొడ్లు
- రాత్రిళ్లు రక్షణ కరువు
- పెచ్చులూడుతున్న గదుల పైకప్పు



వెంకటగిరి : అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి నియోజకవర్గంలోని వసతి గృహాల్లో సంక్షేమం కొరవడి దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి. గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. పైకప్పు పెచ్చులూడి కింద పడుతున్నాయి. మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా వున్నా యి. కొన్నింటిలో నీటి సౌకర్యం లేదు. తలుపులు లేకపోవడంతో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. గదుల్లో కిటికీలకు తలుపులు లేక దోమలతోపాటు చలికి గజగజ వణుకుతున్నారు.

నియోజవర్గంలోని వసతి గృహాలు

మండలం	బాలుర హాస్టళ్లు	బాలికల హాస్టళ్లు	విద్యార్థుల సంఖ్య
వెంకటగిరి	4	3	595
బాలాయపల్లి	2	1	119
డక్కిలి	1	1	28
సైదాపురం	1	-	28
రాపూరు	3	1	400
కలువాయి	1	2	130

- సైదాపురంలోని బీసీ హాస్టల్ 1ను ఇటీవల మూసేశారు. అందులో ఉన్న 27 మంది పిల్లలను బీసీ హాస్టల్ 2కు బదిలీ చేశారు. ఇక్కడ కనీస వసతులు లేవు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.
- కలువాయి మండలంలోని ఎస్సీ వసతి గృహం ప్రహరీ గోడ కూలిపోవడంతో రక్షణగా ముళ్ల కంచె వేశారు. కలువాయిలోని బాలికల వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబు పెచ్చులూడి పడుతుండటంతో విద్యార్థులు భయందోళనకు గురవుతున్నారు.
- రాపూరులో ఉన్న వసతి గృహానికి ప్రహరీ గోడ లేదు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.
- డక్కిలి మండలంలో ఉన్న రెండు సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరింది. మరో వసతి గృహం అద్దె భవనంలో అరకొర వసతులతో కొనసాగుతోంది.
- బాలాయపల్లి మండలంలోని పిగిలాం, బాలాయపల్లిలో మూడు వసతి గృహాలు ఉన్నాయి. వాటిలో అరకొర వసతులు ఉండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.



పెచ్చులూడిన కలువాయి ఎస్సీ బాలికల హాస్టల్

- వెంకటగిరి పట్టణంలో ఉన్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాన్ని ఎప్పుడో నిర్మించిన పాత భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. గదుల పైకప్పు పెచ్చులు ఊడి పిల్లలపై పడుతున్నాయి. పట్టణంలోని క్రాస్ రోడ్డు సమీపంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు మూడు ఉండగా వాటిలో రెండు భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాటికి తలుపులు విరిగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాణీపేట సమీపంలో బాలుర సంక్షేమ వసతి గృహం భవనం శిథిలావస్థకు గురైంది. మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న వసతి గృహం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న బాలికల వసతి గృహం, రాణీపేటలో ఉన్న బాలికల వసతి గృహంలో నిర్వహణ నామమాత్రంగా కొనసాగుతుంది.



కలువాయి : కూలిపోయిన ప్రహరీ గోడ



సైదాపురంలో శిథిలావస్థకు చేరిన బీసీ హాస్టల్-01



కలువాయి : ఎస్సీ హాస్టల్

క్లుప్తంగా

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి

ఓజిలి: ప్రభుత్వం ఆదేశించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి ఆదేశించారు. ఆమె సోమవారం ఇనుగుంట, ఆర్మేనిపాడు, కర్రబల్లవోలు గ్రామాల్లోని సచివాలయాలను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ద్వారా గ్రామంలో ఇళ్లు కలిగిన లబ్ధిదారులతోపాటు దుకాణాలను గుర్తించాలని సూచించారు. మిస్సింగ్ సిటిజన్ సర్వే, చైల్డ్ ఆధార్ సర్వేపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు చిన్నయ్య, శ్రీలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సైదాపురం: మండలంలోని అనంతమడుగు, పాలూరు, సైదాపురం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ జాబ్‌కార్డు ఉన్న కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పనులు చేయించాలని సూచించారు. ఏపీవో చంద్రయ్య పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

సూళ్లూరుపేట రూరల్/దొరవారిసత్రం/సైదాపురం : ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరని వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ అనిత, సైదాపురం వ్యవసాయ అధికారి పి.హైమావతి తెలిపారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, సైదాపురం మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం నుంచి రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు విశిష్ట గుర్తింపు నమోదుకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటి నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు గుర్తింపు నమోదు జరుగుతుందని తెలిపారు. రైతులు అడంగళ్ లేదా 1బీ జిరాక్స్ పత్రాలు ఆధార్, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకుని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పాఠశాల విలీనాన్ని నిలిపివేయాలని వినతి

సైదాపురం: తమ గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని వెంటనే నిలిపివేయాలని పాలూరు రాజుపాలెం వాసులు కోరారు. వారు సోమవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామ పరిధిలో నాలుగు పాఠశాలలు ఉన్నాయని, పాలూరు రాజుపాలెంలో ఉన్న గిరిజన కాలనీ వాసుల పిల్లలు వచ్చే పాఠశాలను ఆర కిలోమీటర్ దూరంలో ఉన్న ఎస్సీ కాలనీలోకి విలీనం చేయడం భావ్యం కాదన్నారు. విలీనం చేస్తే నిరవధికంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

గ్రావెల్ లారీల అప్పగింత



పట్టుబడిన గ్రావెల్ లారీలు

పెళ్లకూరు: మండలంలోని బంగారంపేట, నందిమాల గ్రామాల నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను సోమవారం శిరసనంబేడు గ్రామస్తులు అడ్డుకుని మైనింగ్ అధికారులకు అప్పగించారు. అధికార పార్టీ నాయకులు కొన్ని రోజులుగా గ్రావెల్‌ను లారీలతో నాయుడుపేట పట్టణంలోని పలు వెంచర్లకు తరలిస్తున్నారు. దాంతో రోడ్లు దెబ్బతినడంతో పాటు భారీ స్థాయిలో దుమ్ము, ధూళి లేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో శిరసనంబేడు గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు, గ్రామస్తులు కలిసి గ్రావెల్ లారీలను అడ్డుకుని మైనింగ్ ఏడీ శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. ఆయన ఆదేశాల మేరకు ఆ శాఖ టీఏ రామకృష్ణ, రమేష్ మూడు గ్రావెల్ లారీలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

వెల్లువెత్తిన భూ సమస్యలు



దొరవారిసత్రం : అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు భూ సమస్యలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా పట్టాదారు పాస్ పుస్తకాలు, 1బీ, అడంగల్‌లో చేర్పులు, మార్పులు, పింఛను, పక్కాగృహాలకు సంబంధించిన అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన, ఏఈ మోహన్‌రావు తెలిపారు. ఏఈలు హరికృష్ణ, మెహతాజ్, సూపర్‌వైజర్ హేమలత పాల్గొన్నారు.

కండలేరులో 53.769 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 53.769 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 170, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

దేవారెడ్డిని పరామర్శించిన పేర్నాటి



సుధాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

చిట్టమూరు : మండలంలోని ఆరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి తండ్రి సుబ్బరాఘవరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి సోమవారం ఆరూరు గ్రామానికి చేరుకున్నారు. మృతుడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మంచి నాయకుడిని పార్టీ కోల్పోయిందన్నారు. ఆయన వెంట నాయకులు పాదర్తి రాధాకృష్ణారెడ్డి, వెంకటాద్రి పాల్గొన్నారు.

క్రీడల్లో ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట : ఒంగోలులో ఈ నెల 7 నుంచి 9 వరకు జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ విద్యార్థులు ప్రతిభ చూపినట్టు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్‌లో ప్రథమ స్థానం, చెస్‌లో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. పీడీ మల్లికార్జున్‌రెడ్డి, శోభారాణి, రాము, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



గాంధీనగర్ సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు రూరల్ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం గూడూరు గాంధీనగర్ ప్రాంతంలోని పేదలు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలతో కలిసి సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించారని తెలిపారు. తొమ్మిది నెలలవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటీయూసీ నాయకులు నారాయణ, సునీల్, రాజా, రత్నయ్య, ముని, రూప తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయ భవనం మరమ్మతులపై చర్చ

డక్కిలి: డక్కిలి మండల పరిషత్ కార్యాలయానికి మరమ్మతులు చేసే విషయంపై ఎంపీపీ గోను రాజశేఖర్ సోమవారం అధికారులతో చర్చించారు. ఆయన ఎంపీడీవో టి.గుణశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజుతో కలిసి భవనాన్ని పరిశీలించారు. కొన్నేళ్ల నుంచి వర్షం వస్తే ఉరవడం, విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. దీనిపై సోమవారం సాక్షి దినపత్రికలో మరమ్మతులకు నోచుకోని ఎంపీడీవో కార్యాలయ భవనం అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీపీ రాజశేఖర్ మండల స్థాయి అధికారులతో చర్చించారు. కార్యాలయానికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని ఆదేశించారు.



కార్యాలయంలో పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

కుట్లు, అల్లికలపై విద్యార్థులకు శిక్షణ



కుట్లు, అల్లికల్లో శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార విభాగం ఆధ్వర్యంలో సోమవారం మహిళా విద్యార్థులకు కుట్లు, అల్లికలపై శిక్షణ ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌వీ శంకరశర్మ మాట్లాడుతూ కళాశాలలో నూతనంగా కుట్లు, అల్లికల కోర్సులు ప్రవేశపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ శిక్షణ మహిళలకు స్వయం ఉపాధి పొందేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన నిరుపేద మహిళ పి.సంధ్యకు కళాశాల మహిళా సాధికార విభాగం వారు రూ.3 వేల సాయం చేశారు. కార్యక్రమంలో మహిళా సాధికార విభాగం కన్వీనర్ డి.ఉషారాణి, ఎం.అమ్మాజీ, ఇ.సునీత, డాక్టర్ సల్మా, బి.అనూరాధ, యామని తదితరులు పాల్గొన్నారు.

రైతు స్నేహబంధనం ద్వారా రైతులకు సేవలు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని రైతులకు రైతు స్నేహ బంధనం కార్యక్రమం ద్వారా సేవలు అందించనున్నట్టు అదానీ క్రిష్ణపట్నం పోర్టు యాజమాన్యం సిద్ధంగా ఉందని చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి జగదీష పటేల్ తెలిపారు. ఆయన సోమవారం తమ్మినపట్నంలో గుమ్మళ్లదిబ్బ, కొత్తూరు, లింగవరం, తమ్మినపట్నం, బల్లవోలు గ్రామాలకు చెందిన రైతులకు వేరుశనగ విత్తనాలు, జిప్సం, మోటార్ స్ప్రేయర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్నేహ బంధనం కార్యక్రమం ద్వారా సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసి రైతులకు సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పోర్టు ప్రతినిధులు మృత్యుంజరామ్, అనురాగ్‌ద్వివేది, వెంకటేష్, భాస్కర్, సర్పంచ్ నెల్లిపూడి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



స్ప్రేయర్లు అందజేస్తున్న పోర్టు ప్రతినిధులు

27 ఆర్టీసీ నూతన సర్వీసులు ప్రారంభం

చిల్లకూరు : గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, వాకాడు డిపోల పరిధిలో 27 నూతన ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించినట్టు విక్రమ సింహపురి ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి తెలిపారు. గూడూరు ఆర్టీసీ డిపో నుంచి సోమవారం 11 నూతన సర్వీసులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి డిపో నుంచి అవసరమైన మేర బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తిరుపతి రీజనల్ మేనేజర్ నరసింహులు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యం కోసం మరిన్ని సర్వీసులు నడుపుతామన్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గతంలో గూడూరు రైల్వే స్టేషన్ నుంచి తిరుమలకు బస్సులు నడిచేవని, కోవిడ్ సమయంలో వాటిని నిలిపేశారని గుర్తు చేశారు. వాటిని తిరిగి ప్రారంభించాలని కోరారు. సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీతో మాట్లాడి భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల వినతి మేరకు కాలనీ ఏర్పాటుకు పరిశీలన చేస్తామన్నారు. కార్యక్రమంలో డీపో మేనేజర్ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.



నూతన బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్న రీజనల్ చైర్మన్, ఎమ్మెల్యే

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

చిల్లకూరు : గూడూరు ఏరియా ఆస్పత్రి వద్ద సోమవారం జన విజ్ఞాన వేదిక సభ్యులు గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా బేగం మాట్లాడుతూ రక్త హీనత ఉన్న వారు క్రమం తప్పకుండా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తం తక్కువగా ఉంటే ప్రసవం కష్టమవుతుందన్నారు. దాతలు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, సభ్యులు నాగరాజు, ప్రభాకర్, ఆనంద్, ఇబ్రహీం, చెంచునారాయణ, సుబ్బారావు, మస్తాన్, జగదీష్, పవన్, సాయి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు ఇవ్వాలని నిరసన

చిల్లకూరు : గూడూరు ఏరియా ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. వారు సోమవారం కార్మికులతో కలిసి గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్ మాట్లాడుతూ కార్మికులకు ఆరు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. వారు కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌కు వినతి పత్రం అందజేశారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

గూడూరు రూరల్ : పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని ప్రముఖ వైద్యులు రోహిణి పిలుపునిచ్చారు. గూడూరు మండలం దివిపాళెం పంచాయతీ చవటపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు కృప సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్యాడ్లు, వాటర్ బాటిళ్లు, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆత్మస్థైర్యంతో ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు, అత్తిమంజరి గోపాల్, పర్వతాల రమేష్, పెయ్యల రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణే లక్ష్యం

నాయుడుపేట టౌన్ : శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఆయన సోమవారం సీఐ బాబీ, ఎస్ఐలు, పోలీసులతో కలిసి శ్రీనివాసపురం జగనన్న కాలనీలో కార్డన్ సర్చ్ చేపట్టారు. అనుమానిత వ్యక్తులు, అక్రమ మద్యం, గంజాయి విక్రయాలపై ఆరా తీశారు. వాహనాలకు రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మత్తుకు బానిసలు కావొద్దన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయుడుపేట, పెళ్లకూరు, దొరవారిసత్రం ఎస్ఐలు ఆదిలక్ష్మీ, నాగరాజు, అజయ్‌కుమార్, ఏఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

శ్మశానం ఆక్రమణపై ఫిర్యాదు

కలువాయి: మండలంలోని బాలాజీరావుపేటలో శ్మశానాన్ని కొందరు ఆక్రమించుకుని అంత్యక్రియలు చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని గిరిజనులు వాపోయారు. వారు సోమవారం డీటీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ తమ కాలనీకి చెందిన ఇండ్ల చంద్రమ్మ మృతి చెందిందని తెలిపారు. శ్మశానాన్ని ఆక్రమించుకున్న వారు అంత్యక్రియలు చేయకుండా అడ్డుకున్నారని వాపోయారు. స్పందించిన డీటీ వెంకటేశ్వర్లు ఆర్ఐ సుధీర్, వీఆర్వో అరుణను గ్రామానికి పంపి చంద్రమ్మ అంత్యక్రియలు జరిగేలా ఏర్పాట్లు చేశారు. గ్రామంలో యానాది, ఎరుకల, రజకుల శ్మశానం ఆక్రమణపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

పెన్నబద్దెవోలులో పాఠశాల మార్పుపై నిరసన



పాఠశాలకు తాళం వేసి నిరసన తెలుపుతున్న ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులు

కలువాయి: మండలంలోని పెన్నబద్దెవోలు ప్రాథమికోన్నత పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్చవద్దని విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు డిమాండ్ చేశారు. వారు సోమవారం పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగానే ఉంచాలని, వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరిగి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అవుతుందన్నారు. అనంతరం వారు సచివాలయం, అంగన్‌వాడీ సెంటర్ వద్ద కూడా ఆందోళన చేశారు.

నులిపురుగుల నివారణే లక్ష్యం

సైదాపురం/రాపూరు/వాకాడు/చిట్టమూరు/కలువాయి : పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్ర వేయడం ద్వారా నులి పురుగులను నిర్మూలించవచ్చని సైదాపురం మండల వైద్యాధికారిణి నిత్య ప్రశాంతి, రాపూరు ఎంఈవో జిలాని, వేపినాపి పీహెచ్‌సీ డాక్టర్ ప్రమీలారాజకుమరి, వాకాడు ఎంపీడీవో అన్నపూర్ణారావు, కలువాయి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, సీహెచ్‌వో బాలకొండయ్య తెలిపారు. సైదాపురంలోని గోగినేని సుబ్బానాయుడు ఉన్నత పాఠశాల, రాపూరులోని బాలికల గురుకుల పాఠశాల, వాకాడు, చిట్టమూరు, కలువాయి మండలాల్లోని పలు పాఠశాలల్లో సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశారు. వారు మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల ఆకలి మందగించడంతో పాటు శరీరం నీరసించి పోతుందన్నారు. రక్తహీనత కలుగుతుందని, తగినంత ఎదుగుదల ఉండదన్నారు. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. రాపూరు మండలంలో 12,080 మందికి గాను 11,090 మందికి మాత్రలు వేసినట్టు తెలిపారు. మిగిలిన వారికి 17వ తేదీన వేస్తామన్నారు.





సైదాపురం : మాత్రలు వేస్తున్న మండల వైద్యాధికారిణి, రాపూరులో మాత్రలు వేస్తున్న ఎంఈవో జిలాని

బహిరంగంగా మద్యం సేవించే వారిపై చర్యలు

ఓజిలి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.స్వప్న హెచ్చరించారు. మండలంలోని కురుగొండలో మందుబాబులు వేసిన గ్లాసులు, బాటిళ్లను సోమవారం శుభ్రం చేయించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోనూ పర్యటించి మందుబాబులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. బహిరంగ మద్యం పానం చేసే వారిపై నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.